క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు



మాట్లాడుతున్న హెచ్ఎం వరలక్ష్మి

గొలుగొండ: ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం అనేక మౌలిక సదుపాయాలు కల్పించిందని హెచ్ఎం వరలక్ష్మి తెలిపారు. ఏఎల్పురం జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. సీఎం జగన్మోహన్రెడ్డి విద్యార్థుల భవిష్యత్ కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నాడు–నేడు నిధులతో పాఠశాలను కార్పొరేట్కు దీటుగా అభివృద్ధి చేస్తున్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. వీటిని గుర్తించి ఇక్కడ విద్యార్థులు చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులం ప్రిన్సిపాల్గా నర్సింహారావు



దేవరాపల్లి: తెనుగుపూడి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయం ఇన్చార్జి ప్రిన్సిపాల్గా కె.వి.ఎల్. నర్సింహారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్లెన్స్ నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇన్చార్జి ప్రిన్సిపాల్గా విధులు నిర్వర్తించిన సిహెచ్. రవీంద్రనాథ్ నుంచి ఆయన సీనియారిటీ ప్రాతిపదికన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక విద్యాలయంలోని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

కృష్ణావతారంలో జగన్నాథుడు



చోడవరం ఆలయంలో కృష్ణావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

మాడుగుల: జగన్నాథస్వామి రథయాత్రలో భాగంగా మంగళవారం స్వామివారు కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారు కొలువు దీరిన ఇంద్రద్యుమ్నం వద్ద ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చోడవరం: జగన్నాథస్వామి దశావతారాల్లో భాగంగా కృష్ణావతారంలో ఏడో రోజు మంగళవారం భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు. స్థానిక ప్రాచీన కేశవస్వామి ఆలయంలోని ఉపాలయంలో ఫలభద్రుడు, సుభద్ర సమేతుడైన జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం



డిజిటల్ లిటరసీ బుక్స్తో సీనియర్ సిటిజన్స్

నర్సీపట్నం: సీనియర్ సిటిజన్స్ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్పేజ్ ఇండియా స్టేట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జి.మణిదీప్ సూచించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ లిటరసీపై సీనియర్ సిటిజన్స్కు పట్టణంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్మార్ట్ ఫోన్ వినియోగం, స్ట్రాంగ్ పాస్వర్డ్ని ఏ విధంగా పెట్టుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే ఇలాంటి చర్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం డిజిటల్ లిటరసీ బుక్స్ అందజేశారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి. సుబ్బారావు, ఎన్.పైడన్న, నాయుడు, శంకర్, సత్యనారాయణ, సింహాచలం పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓట్ల తొలగింపు

మాకవరపాలెం: ఓటర్ల తొలగింపులో జాగ్రత్తలు పాటించాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం బీఎల్వోలకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్వోలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరణించిన, మైగ్రేషన్ వంటి ఓట్లను తగిన ఆధారాలతో విచారణ చేసి తొలగించాలని ఆదేశించారు. వచ్చే నెల 21 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం అవుతుందన్నారు. ఈ సర్వేలో ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. 2024 జనవరి ఒకటో తేదీకి ఓటు హక్కుకు అర్హత ఉన్న వారి వివరాలను గుర్తించాలన్నారు. ఏఏ కారణాలతో జాబితా నుంచి ఓట్లను తొలగించాలనే విషయాన్ని తెలియజేశారు. తహసీల్దార్ ప్రసాద్, డీటీలు కృష్ణమూర్తి, శంకర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలతో రైతులకు ఎంతో మేలు

ఎం. కోడూరులో నూతన ఆర్బీకే భవనాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం బూడి



ఎం. కోడూరులో ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మంచి ఆలోచన విధానంతో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అన్ని సదుపాయాలు కల్పిస్తుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలో ఎం.కోడూరులో రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం సబ్సిడీపై విక్రయిస్తున్న ఖరీఫ్ వరి విత్తనాలను రైతులకు అందజేశారు. రైతు భరోసా కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, ఏవో ఎం.వాసుదేవరావు, వ్యవసాయ విస్తరణాధికారి డి.సత్యనారాయణ, వీఏఏ వి. కమల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పక్కాగా నాణ్యత ప్రమాణాలు పాటించాలి

దేవరాపల్లి: తారురోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అధికారులను ఆదేశించారు. చీడికాడ నుంచి కొండవీధి వరకు రూ. 2.20 కోట్లతో మూడున్నర కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న తారురోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మార్కు కనిపించేలా రోడ్ల నిర్మాణం ఉండాలన్నారు. గ్రామాల మధ్య రోడ్ల సదుపాయం కల్పించడం ద్వారా మరింత అభివృద్ధి బాటపడతాయన్నారు.

రైతులకు రాయితీ విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజేశ్వరి

నర్సీపట్నం: అమలాపురం సచివాలయంలో రైతులకు రాయితీపై విత్తనాలను ఎంపీపీ సుర్ల రాజేశ్వరి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఖరీఫ్కు అవసరమైన విత్తనాలను ముందుగానే అందిస్తుందన్నారు. సర్పంచ్ శెట్టి శ్రీను, ఏవో అప్పారావు, వైఎస్సార్సీపీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, చెట్టుపల్లి సచివాలయ కన్వీనర్ ఇన్నం రమణ, సెక్రటరీ రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు: రైతులకు మంచి చేయాలని సీఎం జగన్మోహన్రెడ్డి నిరంతరం తపిస్తున్నారని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అన్నారు. స్థానిక ఆర్బీకేలో మంగళవారం రాయితీపై ఖరీఫ్ వరి విత్తనాలను రైతులకు ఆయన పంపిణీ చేశారు. ఏవో పి.సోమశేఖర్ మాట్లాడుతూ స్వర్ణ 47 క్వింటాళ్లు, సాంబామసూరి 144 క్వింటాళ్లు, సోనామసూరి 57 క్వింటాళ్లు, ఆర్జీఎల్ 304 క్వింటాళ్లు, ఇంద్ర 23 క్వింటాళ్లు, అమర 21 క్వింటాళ్ల విత్తనాలను మండలంలో 22 ఆర్బీకేల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. ఆర్బీకే చైర్మన్ జోకల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు రాయితీలు



కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న రాధిక, తదితరులు

మాకవరపాలెం: పీఎం ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలపై రైతులకు మాకవరపాలెంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి జి.రాధిక మాట్లాడుతూ పచ్చళ్లు, పొడులు, పిండి, అప్పడాలు, వడియాలు, బెల్లం ఉత్పత్తుల వంటి ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపనకు రాయితీలు అందిస్తున్నాయన్నారు. రైతులు యూనిట్ విలువలో పది శాతం చెల్లిస్తే మిగిలిన 90 శాతం బ్యాంకు రుణాలు అందిస్తారన్నారు. ఏపీ ఆహార పరిశ్రమల సంస్థ, ఉద్యాన శాఖ ద్వారా 35 శాతం రాయితీని నేరుగా ఖాతాలో జమ చేస్తారన్నారు. ఏఈవో శేషునాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



తాటిపర్తిలో మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం తాటిపర్తి గ్రామ పంచాయతీ పరిధి గరికబంధ, బిళ్లలపాలెం, లక్ష్మీంపేట, కొత్తూరు ఆనందపురం, కాశీపురం, ద్వారకనగర్ గ్రామాల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి మహిళలతో మాట్లాడారు. సంక్షేమ లబ్ధి వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలు విన్నవించారు. లక్ష్మీంపేటలో కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అధికారులు జారీ చేయకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నామని వాపోయారు. డి.ఫారం పట్టాలు మంజూరు చేయాలని కోరారు. వీటిపై ఆర్డీవోతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బిళ్లలపాలెంలో రామాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. శిథిలావస్థకు చేరిన కాశీపురం, లక్ష్మీంపేట ఎంపీపీ పాఠశాలలకు నూతన భవనాలను నాడు - నేడు నిధులతో నిర్మిస్తామన్నారు. బిళ్లలుపాలెంలో కొత్తగా మంచినీటి బోరు మంజూరు చేస్తామన్నారు. పంచాయతీ పరిధిలో డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యంగా రూ. 20 లక్షల మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. 9 గ్రామాలకు రూ.1.99 కోట్లతో ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తామన్నారు. గిరి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో రూ.28 లక్షలతో అభివృద్ధి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీలు టి.వి.రాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, ఎంపీడీవో మీనాకుమారి, ఉప తహసీల్దారు సత్యనారాయణ, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి, సర్పంచ్ అల్లంగి వెంకట గౌరీదేవి, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, వివిధ గ్రామాల సర్పంచ్లు గొల్లవిల్లి సంజీవిరావు, జామి రమణబాబు, యడ్ల కళావతి, మాజీ సర్పంచ్ సంజీవ్రావు, సచివాలయ కన్వీనర్ శీరా తలుపులు నాయుడు, నాయకులు గొల్లవిలి రాజేశ్, పడాల అప్పలనాయుడు, కోట్ని శ్రీరామూర్తి, సయ్యపురెడ్డి నారాయణరావు, కోరుకొండ చెల్లంనాయుడు, కరణం రాము, కళ్యాణరాజు, బొద్దాపు భాస్కరరావు, యన్నంశెట్టి వెంకట్రావు, దొండా నాగమణి, ఏతులు లెక్కల సత్యనారాయణ, శ్రీనివాసరావు, భార్గవ్కుమార్, నర్సింగరావు, ఎం. రాంబాబు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిపై ఆర్డీవో విచారణ

నాతవరం: ప్రభుత్వ భూములు ఆక్రమించుకోవడం డి.ఫారం పట్టా భూములను కొనుగోలు విక్రయాలు చేయడం చట్టా రీత్యా నేరమని నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరామ్ హెచ్చరించారు. మర్రిపాలెంలో స్పందన ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో ఆయన విచారించారు. ఫిర్యాదుదారుడు, ఈవివాదానికి కారణమైన వ్యక్తిని బహిరంగంగా విచారణ చేశారు. భూమి తాలుకా వాస్తవ పరిస్థితులు, రికార్డుల్లో వివరాలను తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్నాయుడు, సర్వేయరు బాలరెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తగిన ఆధారాలతో కార్యాలయానికి రావాలని ఇరువురిని ఆదేశించారు. డివిజనల్ సర్వే ఇన్స్పెక్టరు వెంకటరమణ, తహసీల్దార్ డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఆర్ఐ, వీఆర్వోలు, సర్వేయరు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కృషి



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దృశ్యం

చోడవరం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని హెచ్ఎం ఐ.వి.రామిరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం పేరెంట్స్ కమిటీ చైర్మన్ డి.ఎస్.ఎస్.కుమారి, చోడవరం సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీనులతో కలిసి పదిలో పాఠశాల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు, ఆణిముత్యాలు అవార్డులను అందజేశారు. గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. హెచ్ఎం జి.జె.సుందర్సింగ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చప్పగడ్డి అప్పలనాయుడు, వైస్ చైర్మన్ జి.పావని పాల్గొన్నారు. జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులను సత్కరించారు.

అక్టోబరుకు రీసర్వే పూర్తయ్యేలా ప్రణాళిక

నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరాం



మాట్లాడుతున్న నర్సీపట్నం ఆర్డీవో జయరాం

నాతవరం: నర్సీపట్నం రెవెన్యూ డివిజన్లోని 357 రెవెన్యూ గ్రామాల్లో విడతల వారీగా రీసర్వే పూర్తి చేసేందుకు దృష్టి సారించామని నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరాం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్లో మొదట విడతగా 50 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి సరిహద్దులో 26,200 రాళ్ల వేశామన్నారు. రెండో విడత కింద 111 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేయగా, ప్రస్తుతం 50 పైగా రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. వచ్చే నెల 15వ తేదీకి మరో 50 చోట్ల పూర్తవుతుందన్నారు. రెండో విడతలో రీసర్వే పూర్తి చేసిన రెవెన్యూ గ్రామాల్లోని భూసరిహద్దులో ఎనిమిది వేలకు పైగా రాళ్లు ఏర్పాటు చేశామన్నారు. మరో 76 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే చేసేందుకు మ్యాప్లు వచ్చాయన్నారు. ఆయా గ్రామాల్లో రీసర్వే అక్టోబరుకు పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రీసర్వేలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రీసర్వే పూర్తయితే బ్రిటిష్ హయాం నుంచి వెంటాడే రైతుల భూసమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయన్నారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్నాయుడు, ఎంపీడీవో హనుమంతరావు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సలకు 34 మంది ఎంపిక

నర్సీపట్నం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం చెట్టుపల్లిలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ గజాల నాగరత్నం ప్రారంభించారు. 82 మంది రోగులకు పరీక్షలు చేయగా, 34 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశామని ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ వరహాలు తెలిపారు. వీరందరినీ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలిస్తామన్నారు. క్యాంపు కోఆర్డినేటర్ అరుణ్కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు వీఆర్ఏపై ఫిర్యాదు

రోలుగుంట: తన విధులు నిర్వహించకుండా రైతులకు అందుబాటులో లేని వీఆర్ఏ శీరందాసు ప్రభావతిపై కొవ్వూరు గ్రామానికి చెందిన పందూరి మాధవరావు, యర్రంశెట్టి గోపి, తదితరులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నర్సింగరావుకు ఫిర్యాదు అందజేశారు. ఆమెను అందుబాటులో ఉండేలా కోరారు. సమస్యను తహసీల్దార్కు నివేదించి చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారులకు సర్ది చెప్పారు.

‘జగనన్న సురక్ష’తో ఇంటి వద్దకే సేవలు



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎల్డీవో ఉదయశ్రీ



పైడిపాలలో వలంటీర్లకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో అరుణశ్రీ



ఏఎల్పురం గ్రామ సచివాలయం వద్ద మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ రఘు

నర్సీపట్నం: ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వ సేవలందించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎల్డీవో ఉదయశ్రీ అన్నారు. యరకన్నపాలెం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఆమె పర్యవేక్షించారు. సర్వే పక్కగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అర్హుల నుంచి ఏ విధమైన ఫిర్యాదు వచ్చినా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

మాకవరపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీడీవో అరుణశ్రీ వలంటీర్లకు సూచించారు. పైడిపాల సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. వచ్చే నెల 23 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సర్పంచ్ రుత్తల జ్యోతి పాల్గొన్నారు.

నాతవరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మేలు కలుగుతుందని ఎంపీడీవో హనుమంతరావు, తహసీల్దార్ ఎస్.ఎస్.వి శ్రీనివాస్నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వల్సంపేటలో ఎంపీడీవో సరుగుడులో తహసీల్దార్ ఇంటింటా సర్వే చేశారు. ఇన్చార్జి ఈవోపీఆర్డీ చినబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గొలుగొండ: ప్రజలకు నూరుశాతం సంక్షేమ చేరడం కోసం జగనన్న సురక్ష సర్వే నిర్వహిస్తున్నామని ఈవోపీఆర్డీ రఘు తెలిపారు. ఏఎల్పురం గ్రామ సచివాలయం వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కర నాయుడు, సర్పంచ్ లోచల సుజాత పాల్గొన్నారు.

కె.కోటపాడు: జగనన్న సురక్షతో ప్రతి కుటుంబానికి మేలు కలగనున్నట్లు మండల సచివాలయాల కన్వీనర్ ఏటుకూరి రాజేష్ అన్నారు. కె.కోటపాడు, గవరపాలెం గ్రామ సచివాలయాల్లో వలంటీర్లకు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు, సర్పంచ్ తోట భవాని, మాజీ సర్పంచ్ నెక్కల పెంటయ్య, మండల యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు పాల్గొన్నారు.

ప్రతిపక్షం వారికీ సంక్షేమ పథకాలు ఇచ్చాం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



వడ్డాదిలో ప్రజా సమస్యలు వింటున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: సంక్షేమ పథకాలు అందడానికి అర్హతే కొలమానం తప్ప ఎటువంటి పైరవీలకు తమ ప్రభుత్వంలో అవకాశం లేదని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. వడ్డాది మేజర్ పంచాయతీలో నెయ్యిల వీధి, చాకలివీధి, గవరవీధి, సాయిబ్ల కాలనీ, ఎస్సీ కాలనీ, పాత కుమ్మరివీధి, బజార్ వీధుల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి మధ్నాహ్నం వరకు మండల, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మండల నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందరికి సక్రమంగా అందుతున్నాయా లేదా? ఇంకా అర్హత ఉండి ఎవరికైనా అందలేదా అని ఆరా తీశారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల ఆమోదంతో టీడీపీ వర్గీయులకు మాత్రమే లబ్ధి చేకూర్చేవారని విమర్శించారు. కొత్త పింఛన్ కావాలంటే, ఎవరైనా పింఛన్దారుడు మృతి చెందితే, ఇంకొకరికి అందించేవారని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల కిందట చేపట్టిన ప్రజా సంకల్పయాత్రలో అధికారంలోకి వస్తే కులం చూడను, పార్టీ చూడను అర్హత వున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తానన్న హామీని తూచ తప్పకుండా పాటించి మాట మీద నిలబడ్డ మొనగాడు సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి అని అన్నారు. ఈ క్రమంలో పలు కాలనీల్లో ప్రజలు గత టీడీపీ ప్రభుత్వంలో ఇళ్లు కట్టుకున్నామని, రూపాయి మాత్రం తమ బ్యాంకు ఖాతాలో వేసి తమకు టోపీ పెట్టారని, అప్పులు చేసి కట్టుకున్న ఇంటికి బిల్లులు చేసి ఆదుకోవాలని 20 కుటుంబాల ప్రజలు కోరారు. త్వరలోనే అర్హతవున్న వారికి ఇంటి బిల్లులు అందేలా చూస్తామని, రూ.1.25 కోట్లతో వడ్డాదిలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి అందరికి తాగునీరు అందిస్తానని, పలు కాలనీల్లో డ్రైనేజీలు ఏర్పాటు చేస్తానని విప్ ధర్మశ్రీ హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైఎస్సార్సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, కోఆపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరి నాగేశ్వరరావు, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి సూరి అప్పారావు, ఎంపీటీసీ కోరుకొండ లీలావతి వెంకటరమణ, నాయకులు కుబిరెడ్డి వెంకటరావు, వీర్ల సురేష్, పొలిమేర కృష్ణ, సయ్యపురెడ్డి కొండబాబు, శంకర్రావు, దాడి పెద గోవింద పాల్గొన్నారు.

4,925 మంది విద్యార్థులకు అమ్మ ఒడి



మాట్లాడుతున్న ఎంపీపీ పైల రాజు

కె.కోటపాడు: మండలంలో 4,925 మంది విద్యార్థులు అమ్మ ఒడి పథకానికి అర్హత సాధించినట్లు ఎంఈవో డీవీడీ ప్రసాద్ అన్నారు. మంగళవారం గొల్లలపాలెం కేజీబీవీ బాలికల పాఠశాల, కె.కోటపాడు హైస్కూల్లో జగనన్న అమ్మఒడి కార్యక్రమంపై పేరెంట్స్ కమిటీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. నాల్గో విడత జగనన్న అమ్మ ఒడి కార్యక్రమాన్ని బుధవారం సీఎం జగన్ ప్రారంభిస్తారని, ఆ వెంటనే ఆయా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తారన్నారు. కింతాడ కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు పాల్గొన్నారు.

విద్యా సంస్కరణల వల్లే మంచి ఫలితాలు

రావికమతం: సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి విద్యా వ్యవస్థలో ప్రవేశ పెట్టిన సంస్కరణలు వల్లే ప్రభుత్వ పాఠశాలల్లో నేడు అత్యుత్తమ ఫలితాలు వస్తున్నాయని ఎంపీపీ పైల రాజు అన్నారు. రావికమతం హైస్కూల్లో జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన కె.పూర్ణిమ, ఎం.లావణ్య, యు.గ్రీష్మలను మంగళవారం ఆయనతోపాటు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ప్రసాద్, త్రిమూర్తులు ఘనంగా సన్మానించారు. నగదు ప్రోత్సాహకాలందించారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ప్రైవేటు దుకాణాల్లో ఏవో ఆకస్మిక తనిఖీ



దేవరాపల్లిలో ప్రైవేట్ విత్తనాల దుకాణాన్ని, తనిఖీ చేస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: లైసెన్స్ దుకాణాల్లో విత్తనాలను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో వై. కాంతమ్మ హెచ్చరించారు. దేవరాపల్లిలోని మన గ్రోమోర్, హేమ రైతు డిపో, నాగ చైతన్య రైతు డిపో, కాశీపురంలోని వెంకట రోహిణి విత్తన లైసెన్స్ షాపులను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన బస్తాల నుంచి శాంపిల్స్ సేకరించి నాణ్యత నిర్ధారణ కోసం ల్యాబ్కు పంపించనున్నట్లు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ లైసెన్స్ దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రసీదు పొందాలని సూచించారు. పంట కాలం పూర్తయ్యే వరకు ధాన్యం బ్యాగ్ ట్యాగ్ కచ్చితంగా భద్రపరచాలన్నారు. ఎంటీయూ 1075, ఎంటీయూ 1010 రకాల పంటలను వేయవద్దని, వీటిని ప్రభుత్వం కొనుగోలు చేయడంలేదన్నారు. ప్రైవేటు విత్తన దుకాణాల్లో ఆర్జీఎల్ 2537, బీపీటీ 5204, 3291, ఎంటీయూ 1121, సంపద ఎంటీయూ 1064 తదితర రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్. కిరణ్కుమార్ ఉన్నారు.

సర్వే నంబరు 171లో చెరువు ప్రభుత్వానిదే..

స్పందన వినతులపై ఆర్డీవో విచారణ



చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

మాకవరపాలెం: సర్వే నంబర్ 171లో 8.68 ఎకరాల చెరువు రికార్డుల ప్రకారం ప్రభుత్వానిదని ఆర్డీవో జయరాం అన్నారు. మాకవరపాలెంలోని ఈ చెరువును ఉపాధి పథకంలో అభివృద్ధి చేయాలని ఆయకట్టు రైతులు స్పందనలో కలెక్టర్కు వినతి పత్రం అందించారు. ఈ చెరువు ప్రైవేటుదంటూ మరికొందరు వినతిపత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆర్డీవో ఇక్కడ చెరువును పరిశీలించారు. సరిహద్దులు, ఆక్రమణలపై ఆరాతీశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాల ఫిర్యాదుదారులతో మాట్లాడారు. నివేదికను కలెక్టర్, జేసీలకు అందజేస్తామని ఆయన తెలిపారు. రికార్డుల ప్రకారం ప్రభుత్వానిదన్నారు. ఇక ఉపాధి పనులు చేయడంతోపాటు గట్టుపై మొక్కలు తొలగించాలని రైతులు విన్నవించారన్నారు. ప్రస్తుతం చెరువులో నీరు ఉన్నందున ఉపాధి పనులు చేసే వీలు లేదన్నారు. గట్టుపై చిన్న మొక్కల మినహా పెద్ద చెట్లను తొలగించ వద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, డీటీ కృష్ణమూర్తి, వైఎస్సార్సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, సర్పంచ్ అల్లంపల్లి శిరీష, ఉప సర్పంచ్ లాలం రాము పాల్గొన్నారు.

చెరువు గర్భం ఆక్రమణపై ఫిర్యాదు



ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

బుచ్చెయ్యపేట: గంటికొర్లాం శివారు భట్లోవలో నల్ల చెరువు గర్భాన్ని క్వారీ యాజమానులు ఆక్రమించడంపై సర్పంచ్, గ్రామ నాయకులు తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వే నెంబర్ 11-10లో 17.68 ఎకరాల విస్తీర్ణంలో నల్ల చెరువు గర్భం ఉంది. ఈ చెరువు మధ్యలో నుంచి రాయల్ గ్రానైట్ క్రిష్టల్ వారు రోడ్డు వేయడమే కాక పక్కనే సర్వే నంబర్ 11-11లో 78 సెంట్ల ప్రభుత్వ భూమిని సర్వే నెంబర్ 13-1లో గోర్జి ఆక్రమించారన్నారు. వీటిని స్వాధీనం చేసుకోవాలని సర్పంచ్ శరకాన గౌరమ్మ, మాజీ సర్పంచ్ శరకాన బాబూరావు, అప్పారావు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తామని తహసీల్దార్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

గోడపత్రిక విడుదల

మాడుగుల: సైన్స్ పట్ల ఆసక్తి కలిగించడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని, డివిజన్ అధ్యక్షుడు సురేష్శాంతో తెలిపారు. జేవీవీ 35వ ఆవిర్భావం సందర్భంగా మంగళవారం మాడుగులలో సంబరాలు నిర్వహించారు. గోడ పత్రిక విడుదల చేశారు. రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. సభ్యులు టి. నాగచంద్ర, గౌరీపట్టపు మహేష్కుమార్, జాగాని ఈశ్వరరావు, జి.చిన్నంనాయుడు పాల్గొన్నారు.